క్లుప్తంగా

27న ఉచిత మెగా వైద్య శిబిరం

చీమకుర్తి: చీమకుర్తి సీహెచ్‌సీలో ఈ నెల 27వ తేదీ 12 మంది స్పెషలిస్ట్ డాక్టర్ల సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వస్థ నారీ–స్వసక్త పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అదే రోజు రక్తదాన శిబిరం కూడా జరుగుతుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీహెచ్‌సీలో అరుదైన శస్త్ర చికిత్స...

చీమకుర్తి సీహెచ్‌సీలో అరుదైన ఆపరేషన్ చేసినట్లు డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 16వ తేదీ నిప్పట్లపాడు గ్రామానికి చెందిన దీవెనకుమారి అనే మహిళ అండాశయం కుడిపక్కన 70 సెంటీమీటర్ల పరిమాణం కలిగిన గడ్డతో బాధపడుతుండగా ఆపరేషన్ చేసి సురక్షితంగా తొలగించినట్లు వివరించారు. డెర్మాయిడ్ అనే ఈ గడ్డ 1–2 శాతం మందికి క్యాన్సర్‌గా మారే ప్రమాదం ఉందన్నారు. అయితే, దీవెన కుమారికి గడ్డను తొలగించిన తర్వాత సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు. ఆపరేషన్ చేసిన డాక్టర్లు ఉష, శ్వేత, రఘూన్సీలను అభినందించారు.

క్విస్ కళాశాలలో మేధావుల సదస్సు



మాట్లాడుతున్న సూర్య కళ్యాణ్ చక్రవర్తి

ఒంగోలు సిటీ: స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మేధావుల సదస్సు నిర్వహించినట్లు కళాశాల చైర్మన్, రాష్ట్ర బీజేపీ సెల్స్ కో–కన్వీనరు డాక్టరు నిడమానూరి సూర్య కళ్యాణ చక్రవర్తి తెలిపారు. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా పక్షోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ సదస్సులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు, నాయకుడు కొమ్ము నర్సింగరావు, ఇందిరా ప్రియదర్శిని లా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ సి.వి.రామకృష్ణ, డాక్టర్ హిమబిందు, కృష్ణారెడ్డి, బొద్దులూరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడితేనే మత్స్య సంపద

- మత్స్యకార సంక్షేమ సమితి స్టేట్ సెక్రటరీ తిరుపతిరావు



కొత్తపట్నం బీచ్‌లో వ్యర్థాలు సేకరిస్తున్న మత్స్యకార సమితి సభ్యులు

కొత్తపట్నం: సముద్రతీరంలో అనేక రకాల వ్యర్థాలు వేయడం వలన పర్యావరణం దెబ్బతిని మత్స్యసంపద అంతరించిపోతుందని, వాటిని అరికడితేనే మత్స్యసంపద ఉంటుందని మత్స్యకార సంక్షేమ సమితి స్టేట్ సెక్రటరీ సున్నపు తిరుపతిరావు అన్నారు. మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో కొత్తపట్నంలోని కె.పల్లెపాలెం బీచ్‌లో శనివారం స్వచ్ఛ సాగర్ – సురక్షిత సాగర్ అనే కార్యక్రమం నిర్వహించారు. 831 మంది పాల్గొని మూడు క్వింటాల వ్యర్థాలు సేకరించి తొలగించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ సముద్రాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఒంగోలు నగరంలోని వ్యర్థాలు తీసుకొచ్చి తీరంలో పడేయడం వలన మత్స్య సంపద అంతరించిపోతోందని, దీనిని అందరూ తెలుసుకుని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తద్వారా తీరం వెంట ఎక్కువగా మత్స్య సంపద ఉత్పత్తి అవుతుందన్నారు. ఫిషరీష్ ఏడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సముద్రంలో ప్లాస్టిక్ వేయటం వలన చేప గుడ్లు చనిపోతాయన్నారు. వ్యర్థాలు వేయడం వలన మత్స్యకారులు నష్టపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మెరైన్ ఎస్సై పి.సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు పిన్ని నరసింహారావు, రేవు చలపతివర్మ, కొక్కిలగడ్డ శ్రీనివాసులు, జి.పేరయ్య, ఆషారావు, నాగార్జున, కాపులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై పోలీసుల స్పెషల్ డ్రైవ్



వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న రూరల్ సీఐ శ్రీకాంత్, పోలీసు సిబ్బంది

మద్దిపాడు: జాతీయ రహదారిపై మండలంలోని ఏడుగుండ్లపాడు సమీపంలో ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో శనివారం పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు నిర్వహించిన ఆ కార్యక్రమంలో హెల్మెట్ ధరించని 15 మంది వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించి జరిమానాలు విధించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానాలు విధించారు. మద్యం సేవించి వాహనం నడుపుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. స్పెషల్ డ్రైవ్‌లో మద్దిపాడు ఎస్‌ఐ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించాలి

ఒంగోలు సిటీ: జిల్లా పోలీస్ కార్యాలయంతో పాటు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది శనివారం మొక్కలు నాటారు. పోలీస్ కార్యాలయ ఆవరణను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యతని అన్నారు. వాహనాల వాడకాన్ని, ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలని సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని పెంచే బాధ్యతను ప్రతిఒక్కరూ తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ఐకమత్యంతోనే బహుజనులకు రాజ్యాధికారం



మాట్లాడుతున్న గౌతమ్

ఒంగోలు వన్‌టౌన్: ఐకమత్యంతోనే బహుజనులకు రాజ్యాధికారం సాధ్యమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్ అన్నారు. స్థానిక ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి



పోషణ మహోత్సవాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ, సిబ్బంది

చీమకుర్తి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సీడీపీఓ యువాంజలి సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని పల్లామల్లి గ్రామంలో గల ఎంపీపీ స్కూల్లో శనివారం ఎనిమిదో రాష్ట్రీయ పోషణ మహోత్సవాలు నిర్వహించారు. సీడీపీఓ పాల్గొని అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఆహార పదార్థాల స్టాల్స్‌ను పరిశీలించారు. తల్లులు, పిల్లలు ఆహారం తీసుకునే క్రమంలో ఆకుకూరలు, చిరుధాన్యాలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, టీచర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారులకు రక్షణ కల్పించండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకట్రావు

చీమకుర్తి: గొర్రెలు, మేకల పెంపకందారులపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి సామాజిక రక్షణ చట్టం తీసుకురావాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘ రాష్ట్ర కార్యదర్శి పూసపాటి వెంకట్రావు డిమాండ్ చేశారు. శనివారం చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన గొర్రెలు, మేకల పెంపకందారుల మండల స్థాయి సమావేశంలో వెంకట్రావు మాట్లాడారు. జీవాలకు అవసరమైన మందులను ప్రభుత్వమే ఉచితంగా ఇవ్వాలని, మరణించిన ఒక్కో జీవానికి రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉచిత బీమా అమలు చేయాలని, నాబార్డు ద్వారా 50 శాతం సబ్సిడీతో రుణాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు తోట తిరుపతిరావు, పల్లాపల్లి ఆంజనేయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.